క్లుప్తంగా

నేడు ఆహా క్యాంటిన్ ప్రారంభం

జమ్మలమడుగు : పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్నట్లు మెప్మా అధికారి గంగులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పది గంటలకు స్థానిక పాతబస్టాండ్‌లోని మెప్మా కార్యాలయం కింద ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ ఈ క్యాంటిన్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులందరూ హాజరవుతారని తెలిపారు.

ప్రతిభతోనే తగిన గుర్తింపు



విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

పులివెందుల రూరల్ : విద్యార్థులు ప్రతిభతోనే తగిన గుర్తింపు పొందుతారని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్ వసుంధర అన్నారు. సోమవారం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ సాక్ష్యం ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ట్రైనర్ అంకిత సాఫ్ట్‌వేర్ కోర్సు అయిన ఫుల్‌స్టాక్‌లో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ, ఈసీ, ఈఈఈ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బ్రాంచ్ విద్యార్థులకు గత 10 రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాంబయ్య, మురళీ పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశానికి గౌరవ సభ్యులు రాక పోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశామని ఎంపీడీఓ రహమత్తులయ్య తెలిపారు. తదుపరి సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షునిగా హరి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : జమ్మలమడుగు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షునిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బోడిశెట్టి హరి రాయల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ కాపునాడు అధ్యక్షుడు గంగుల వీరాంజనేయులు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు గాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపునాడు అభివృద్ధికి, విద్య ఉద్యోగ రంగాలలో ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రైతులు సలహాలు పాటించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త

ముద్దనూరు : వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సలహాలను రైతులు పాటించి సాగులో వృద్ధి చెందాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో డబ్ల్యుడీసీ-పీఎంకేఎస్వై, డ్వామా ఆధ్వర్యంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు 3రోజుల పాటు సాగులో మెలకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వాతావరణ వివరాలు అందించడానికి ప్రత్యేక యాప్‌లు ఉన్నాయని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో వానపాముల ఎరువు ఎంతో ప్రాముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి, డబ్ల్యుసీపీవో కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రైతులు

లింగాల: లింగాల మండలం బోనాల గ్రామానికి చెందిన రైతులు సోమవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి తమ పొలంలో పైపులను ఎత్తుకెళ్లిన దొంగలను గుర్తించి తమకు పైపులను ఇప్పించాలని కోరారు. వివరాలిలా.. బోనాల గ్రామానికి చెందిన పీవీ క్రిష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డిలు తమ పొలంలో సాగునీటి కోసం 150 పైపులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అయితే ఈ పైపులను గత నెల 9వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకెళ్లారని తెలిపారు. ఈ విషయమై గత నెల 10వ తేదీన లింగాల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆయన ఇంత వరకు దొంగల ఆచూకీని కనుగొనలేదని తెలిపారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు ఎస్పీని కోరారు.

సర్వర్ సమస్యను పరిష్కరించండి

బద్వేలు అర్బన్ : రేషన్ పంపిణీలో ఈ-పాస్ యంత్రాలకు ఏర్పడిన సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ ఆకుల వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోశాధికారి నరసింహులు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ-పాస్ యంత్రాలకు సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకోవడానికి ఇబ్బందులు వస్తుండటంతో పంపిణీ ఆలస్యమవుతోందని అన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

కాలువలకు నీరు విడుదల చేసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కాలువలకు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. అచ్చవెల్లి గ్రామ సమీపంలో సుమారు రూ.90లక్షల పాడా నిధులతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ అధికారులు ఎర్రిపల్లె వంకపై ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా అచ్చవెల్లి, పుట్రాయునిపేట గ్రామాల్లోని 150 ఎకరాలకు కాలువల ద్వారా నీరు సరఫరా అవుతుందని ఆయన అన్నారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డి అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం అక్కడ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలువలకు నీటిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు విడుదల చేశారు. కాలువలకు నీరు విడుదల చేయడం ద్వారా బోర్లలో నీటిశాతం పెరిగి రైతులు పంటలు బాగా పండించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీబీసీ ఈఈ రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, షరీఫ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యా సామగ్రిని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు దాదిరెడ్డి భాగ్యమ్మ

చెన్నూరు : మండలంలోని కైలాసగిరికోనలో ఎస్టీ డ్రాప్ అవుట్ విద్యార్థుల కోసం నూతనంగా ప్రారంభించిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకురాలు దాదిరెడ్డి భాగ్యమ్మ సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు, ఎరైజర్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజంలో గౌరవ మర్యాదలతో జీవించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లయితే వారికి ప్రోత్సాహంగా బహుమతులు అందజేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రాజారావు, గ్రామ సచివాలయ సిబ్బంది బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శంకర్ నాయక్



రూరల్ పరిధిలోని ఎస్ఐలకు దిశానిర్దేశం చేస్తున్న సీఐ శంకర్‌నాయక్

చింతకొమ్మదిన్నె : కడప రూరల్ సీఐగా శంకర్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుట్టపర్తి నుంచి బదిలీపై ఇక్కడకు రాగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గత సీఐ విజయభాస్కర్ గౌడ్ బదిలీపై అనంతపురం వెళ్లారు. నూతన సీఐకు సీకేదిన్నె, పెండ్లిమర్రి, చెన్నూరు ఎస్ఐలు భూమా అరుణ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఉపేక్షించేది లేదన్నారు. మట్కా, పేకాట రాయుళ్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతామన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వినతి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్య పరిష్కారానికి కృషిచేయాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. శ్రీకాంత్‌రెడ్డి, డా. ఆర్. నీలయ్య కోరారు. సోమవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధ్యాపకుల మూల్యాంకన వేతనాలను పెంచాల్సి ఉన్నప్పటికీ దాదాపు 6 సంవత్సరాలవుతున్నా పెంపుదల నోచుకోలేదన్నారు. మూల్యాంకనానికి సంబంధించి అధ్యాపకుల సీనియారిటీ జాబితాను రూపొందించాలని కోరారు. దసరాల సెలవులను ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. జాతీయస్థాయి క్యాంపుల్లో పాల్గొనే ఎన్‌సీసీ కేడెట్స్‌కు హాజరులో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి డా. పి. రామకృష్ణ పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : నిషేధిత కలుపు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం మండలంలోని ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న స్టాకును పరిశీలించారు. నాణ్యమైన పురుగు మందులు మాత్రమే ఎమ్మార్పీ ధరలకు మించకుండా రైతులకు విక్రయించాలని సూచించారు. పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. పురుగు మందులు అవసరమైన రైతులు తెగులు వ్యాపించిన పంటను వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి వారు సిఫార్సు చేసిన మందులను వాడాలన్నారు.

అర్చకుల సమస్యలపై వినతి

కడప కల్చరల్ : స్థానిక దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులుగా సేవలు అందిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ తిరుమల-తిరుపతి దేవస్థానాల ప్రతినిధులను కోరారు. సోమవారం ఆయన అర్చకులతో కలిసి టీటీడీ పాలక మండలి సభ్యులు మాసీమ బాబు, యానాదయ్యలను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్ తదితరులు తమ సమస్యలను నేరుగా వారికి విన్నవించారు. ఇటీవల మరణించిన రిటైర్డ్ అర్చకులు మచ్చా శేషాచార్యుల కుమారుడికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు వరంగా అందించిన అర్చకుల అనువంశిక వెసలుబాటును తమకు కూడా తప్పక వర్తించేలా చూడాలని కోరారు. నేడు జరగనున్న పాలక మండలి సభ్యుల సమావేశంలో ఈ అంశాలను తప్పక బోర్డు దృష్టికి తేగలమని సభ్యులు తెలిపారు.

టైర్ల మీద చేస్తున్న ఖర్చును తగ్గించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బస్సుల టైర్ల విషయంలో చేస్తున్న ఖర్చును తగ్గించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కడప జోనల్ వర్క్‌షాప్‌లో టైర్ల సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా జోన్ పరిధిలోని 33 డిపోల టైర్ మెకానిక్‌లు, గ్యారేజ్ ఇన్‌ఛార్జిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు టైర్ల మన్నిక పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బస్సు బయలుదేరే సమయానికి టైర్లను జాగ్రత్తగా పరిశీలించి మెకానిక్‌లచే అవసరమైన మరమ్మతులు చేయించుకోవాలన్నారు. అనంతరం టైర్ల సంరక్షణకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జేకే టైర్ కంపెనీ సర్వీస్ ఇంజనీరు, వర్క్స్ మేనేజర్ అజ్మతుల్లా, డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీ



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ వద్దగల అజ్మత్ కల్యాణ మండపంలో సోమవారం కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహా ప్రవక్త మహమ్మద్ గురించి క్విజ్‌పోటీలను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని మదరసా, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించామన్నారు. నగరంలోని జామియా తుస్సాలిహాత్ మదరసాతోపాటు ఉమ్మడి జిల్లాలోని 18 కేంద్రాల్లో ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు.

సమష్టిగా మండల అభివృద్ధికి పాటు పడదాం



వల్లూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ

వల్లూరు : అధికారులు, ప్రజా ప్రతినిధులందరం సమష్టిగా పని చేసి వల్లూరు మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీవో జుబేదా మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా వాటి నిరోధానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని అన్నారు. మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఆవరణలో జరిగే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న జగనన్నా నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జగనన్న భూ హక్కు – భూ రక్ష కార్యక్రమం కింద గ్రామాల్లోని స్థలాల రీసర్వే జరుగుతోందని, ఈ కార్యక్రమం అమలులో మన మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉందని ఈఓపీఆర్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ శంకర్ రావు, ఏఓ సాయి జ్యోతి, ఎంఈఓ లిల్లెమ్మ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి శివారెడ్డికి లేదు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి

చెన్నూరు : కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డిని విమర్శించే స్థాయి తెలుగుదేశం నాయకుడు ఇందిరెడ్డి శివారెడ్డికి లేదని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చెన్నూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరెడ్డి శివారెడ్డి బాగోతం మండల ప్రజలందరికీ తెలుసన్నారు. నాలుగేళ్ల క్రితం కడప ఎయిర్‌పోర్టు పరిధిలో 20 ఎకరాల భూమిని ఎకరా 12 లక్షలకు ఇతరులకు విక్రయించి రూ. 4 లక్షలకు విక్రయించినట్లు ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి కుమారుడికి అబద్ధం చెప్పారన్నారు. ఆ తర్వాత ఆయన నిజానిజాలు తెలుసుకోవడంతో పంచాయతీ పెట్టించిన విషయం వాస్తవం కాదా అని నిలదీశారు. ఇంతటి నీచమైన చరిత్ర ఉన్న మీరు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలో కూడా నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని వారికి చేతనైనంత సహాయం చేసిన వ్యక్తి ఎమ్మెల్యే అన్నారు. కరోనా సమయంలో తెలుగుదేశం నాయకులు గడప దాటి బయటికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కమలాపురం నియోజకవర్గంలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే అన్నారు. త్వరలోనే చెన్నూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరతారని, నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందుతారని శివారెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్ఆర్, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, మండల కో ఆప్షన్ సభ్యుడు వారిష్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మానవత సభ్యులు

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో 40 మంది గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జీరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో గర్భిణులకు డాక్టర్ ఎన్.రామాంజనేయరెడ్డి చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పద్మావతి, జ్యోత్స్న, మానవత కార్యదర్శి కల్లూరు గంగాధర్‌రెడ్డి, రాజారెడ్డి, తోట శ్రీనివాసరెడ్డి, రామగోవిందరెడ్డి, శ్రీరాములు, సాంబశివారెడ్డి, రాజవర్దన్‌రెడ్డి, సుబ్బరాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులర్ పీజీటీలుగా పరిగణించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి లక్ష్మిరాజ

వేంపల్లె: ప్లస్ టు పాఠశాలలో పనిచేస్తున్న పీజీటీలను రెగ్యులర్ చేసి రెండు ఇంక్రిమెంట్లను వెంటనే మంజూరు చేయాలని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి లక్ష్మిరాజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవిద్యా విధానానికి నష్టాన్ని చేకూర్చే జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల్ని కాపాడే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. గత ఆరేళ్ల నుంచి పర్మినెంట్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని, వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, నాయకులు వన్నూరు బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం ఈమేరకు కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ జనరల్ బోగీలు ప్రతి రైలుకు రెండు మాత్రమే ఉండటంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రయాణం చేయాలంటే వందే భారత్ రైలు టికెట్ ధరలు తగ్గించాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బ్రహ్మం, నగర అధ్యక్షులు శివ నాగేంద్ర, నగర కార్యదర్శి మైనుద్దీన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



లింగాల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి



సింహాద్రిపురం : రోగులకు బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు



వీరపునాయునిపల్లె : మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ పేదవాడు వైద్యం కోసం అప్పులు చేయకుండా నాణ్యమైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ, డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, వైఎస్సార్సీపీ నాయకులు విశ్వరూప జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగశేషుల రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు సుభాషిణి, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

350 మందికి ఆరోగ్య పరీక్షలు

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాలెం సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ తెలిపారు. తాటిమాకులపల్లె, కదిరేపల్లె, తంగెడుపల్లె, యు.రాజుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోతి, లక్ష్మిప్రియ, హుస్సేన్ బాషా, జరీనా, వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హిమకుంట్లలో జగనన్న సురక్ష వైద్య శిబిరం

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు నెట్‌క్యాప్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేద ఆర్థిక ఇబ్బందులు పడకుండా కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ వైద్యశిబిరాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ నాగలింగాచారి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రమణారెడ్డి, కృపాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తిప్పిరెడ్డిపల్లెలో..

పెండ్లిమర్రి : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు కొమ్మద్దిలో

మండలంలోని కొమ్మద్ది సచివాలయంలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కొమ్మద్ది, బసిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

చెన్నూరు : రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి సీహెచ్ వెంకటసుబ్బయ్య, మండల వ్యవసాయ సలహాదారు ఎర్రసాని మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం వారు మండలంలోని ఉప్పరపల్లె గ్రామపంచాయతీలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష 'కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.చెన్నారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 60 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, సొసైటీ డైరెక్టర్ గాజులపల్లె సంపూర్ణం రెడ్డి, తహసీల్దార్ పఠాన్ అలీ ఖాన్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఏపీఎం గంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరు : డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

వీఓఏల సమస్యల పరిష్కారానికి నేడు, రేపు ఆందోళన

ప్రొద్దుటూరు : జిల్లాలోని వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 10, 11 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సోమవారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వీఓఏల మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. 5జీ మొబైల్స్ ప్రభుత్వం ఇవ్వాలని, వలంటీర్ ఐడీతో కాకుండా వీఓఏ ఐడీద్వారా పని చేయించి వేతనాలు చెల్లించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ పి.యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలియజేశారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. త్వరలోనే పోలీసుశాఖ తరఫున ఆటోలకు నెంబర్లు కేటాయిస్తామని అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు ఓబులేసు, కోటేశ్వర్‌రావు, హోంగార్డు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు